
# పరాన్నజీవి



రమేష్ మనస్సు మనస్సులో లేదు. ఎద బాధతో కుమిలిపోతోంది. యూనివర్సిటీహాస్టల్‌లోమంచం మీద పడుకున్నాడు. పడుకున్నాడన్న మాటే గానీ నిద్రరావడం లేదు. మంచం మీద ముళ్ళు గుచ్చుకుంటున్నంత వెత.

పక్క మంచం మీద తన క్లాస్‌మేట్ రమణ గుర్రుపెడుతున్నాడు. "వాడెంత హాయిగా నిద్రపోతున్నాడు" అన్పించింది. అశాంతి నిలువనీడం లేదు. రిస్ట్ వాచీ చూసుకున్నాడు. అర్ధరాత్రి దాటింది. కడుపులో పేగులు అల్లరి పెడుతున్నాయి. సాయంత్రం

మెస్‌లో భోంచేశాడన్న మాటే గానీ కడుపు నిండలేదు. హాస్టల్‌లో తిండి తినాలంటే అదో రకమైన అసహనం. ఎందుకో అర్థం కాదు. ఎప్పుడూ దిగులు — ఎందుకో బోధపడదు. దీనికి పరిష్కారం ఏమిటి అని అనుకున్నాడు. అర్థం కాలేదు.

దిగులు—
దిగులు దిగులుగా దిగులు
ఎందుకా?
ఎందుకో చెప్పే వీలుంటే
దిగులెందుకు? అనే రేవతీదేవి దిగులు

జ్ఞప్తికొచ్చింది. మరీ దిగులేసింది. కావాలని దిగులును అరువు తెచ్చుకుంటున్నానా అని ప్రశ్నించుకున్నాడు.

అలా అన్పించడం లేదు. దసరా పండక్కి ఊరెళ్ళినపుడు జరిగిన సంఘటన దిగులుతో పాటు కసినీ తెచ్చిపెట్టింది.

** ** ** **

ఆలేరులో తమ ఊరికెళ్ళే బస్సు కోసం నించున్నాడు. ఎప్పటిలా అసహనం వెంటాడుతూనే వుంది. ఇంతలో ఓ ముసిలాయన దగ్గరగా వచ్చి రమేష్‌ను పరికించి చూసి "ఏవూరు మనది?" అని అడిగాడు. రమేష్ అతన్ని చూశాడు. దాదాపు 60 ఏళ్ళు ఉండొచ్చు. నేసిన ముతక ధోవతి— అదే రకం చొక్కా— తలకు చుట్టుకున్నరుమాలుపక్కా పల్లెటూరి మనిషి అని తేల్చేసి చెప్తున్నాయి.

'బొందుగులం' జవాబిచ్చాడు రమేష్,


కాసుల ప్రతాపరెడ్డి

'ఎవరి బిడ్డవు?' మరో ప్రశ్న

'కోటిరెడ్డి కొడుకును'

''పెద్దోనివైనవ్ — ఎప్పుడో గింత పిల్లకాయప్పు డు చూసిన''

మాట్లాడలేదు రమేష్. రమేష్ హైదరాబాద్ వెళ్ళి ఆరేళ్ళపైనే అవుతోంది. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి అక్కడే ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.ఏ. చేస్తున్నాడు. పల్లెటూరి మట్టివాసనకు దూరం కావడంతో పల్లెటూరి వారితో ఎల్లా మాట్లాడాలో కూడా తెలియని పరిస్థితి వచ్చింది. వారితో ఏం మాట్లాడాలో కూడా అర్థం కాదు. కొందరు గంటల తరబడి మాట్లాడ్తారు— నవ్వుకుంటారు. యూనివర్సిటీలో కూడా అంతే— రెండు, మూడు మాటలు తప్పించి ఎవరితోనూ సంభాషణ కొనసాగించలేదు. అందుకనే అతనికి ఫ్రెండ్స్ కూడా తక్కువ.



''యాడుంటన్నవ్ బిడ్డా?'' ముసిలాయన మరో ప్రశ్న వేశాడు.

''హైదరాబాద్''

''కొల్వేంది?''

''చదువుకుంటున్నా''

''ఎన్నోది?''

ఎం.ఏ. అంటే ముసలాడికి అర్థం కాదు. ఆ విషయం రమేష్‌కు తెల్సు. అందుకనే ''పదిహేడో తరగతి అని చెప్పాడు.

''అటెన్కా ఏ కొల్వు దొర్కుతది?''

''ఏమో, చెప్పలేం''

''గింత సదువు సదివిఇం టెన్క సమ్మదేనా?''

ఆ మాట ముసిలాడుతెలిసన్నాడో, తెలియకన్నాడోగాని రమేష్‌గుండెలో ముల్లులాగుచ్చుకుంది.

'సదువుకునేతందుక్క ఎన్ని పైసలయితై?'

'నెలకు నాలుగైదు వందలు'

'నాయినే ఇస్తుండా?'

''ఆ''

'గౌరు..డే — మా అయ్యలు అయిదారేండ్ల ఈడుకె బర్రెతోక పట్టిచ్చెటోండ్లు. గదే పట్టుడు— ఇడుసుడే లేదు. మీరు కర్సు లొల్లయితిరి' అన్నాడు ముసిలాడు. దానితో మెదడును ఆలోచనల పురుగులు తొలవడం ప్రారంభించాయి. తనకు ఎంతలేదన్నా 24 ఏళ్ళు. ఇంకా తను పరాన్నజీవే. తనది పరాధీన జీవితమే — బాధేసింది— బాధేసింది— నిస్పృహ, నిస్తేజం ఆవరించాయి. హైదరాబాద్ నగరంలో హోటళ్ళలో కప్పులు కడిగే పసివాళ్ళు, పెట్రోల్ బంకుల్లో పనిచేసే కుర్రాళ్ళు, బూట్లు పాలిష్ చేసే పిల్లలు గుర్తొచ్చారు. తనకన్నా వాళ్ళే నయమనిపించారు.

అతనికి వాళ్ళ రెక్కల కష్టం మీద వాళ్ళు బతుకుతున్నారు. తనది ఇంకా పెద్దల మీదబతుకే. తన మీద తనకే అసహ్యం వేసింది. ఇంత చదువు చదివినా ఉద్యోగం దొరుకుతుందన్న గ్యారంటీ లేదు. ముందంతా చీకటి— వెనక్కి వెళ్ళి తన తమ్ముడిలా నాగలి పట్టలేడు. పార పట్టలేడు. నాగలిచక్కగా పట్టుకోవడంరాదు.

ఇది వరకోసారి ఇంటికి వెళ్ళినపుడు తనకు సరదాగా నాగలి పట్టాలన్పించింది. తమ్ముడు రాంరెడ్డితో పొలానికి వెళ్ళాడు. వాడు కోడికి ఎడ్లను కదుతుంటే ఆశ్చర్యమేసింది తనకు. దగ్గరకు వెళ్ళి పరిశీలనగా చూశాడు. తనకు జోళ్ళు కట్టడం చాతకాదు— ఏదో చిక్కుముడిలా వుంది లాభం లేదనిపించింది.

''నాగలి పడతావా'' బతిమాలినట్టు అడిగాడు తమ్ముడ్ని.

''కొద్దిగాగు. కొంచెసే ఇస్త''చెప్పాడు ఆరితేరినవాడిలా. వాడు తనకన్నా మూడేళ్ళు చిన్న. అయినా తనకన్నా పెద్దవాడిలా అన్పించాడు. పనివల్ల, అనుభవం వల్ల నిదానం అలవడి పెద్దమనుషుల్లానే వ్యవహరిస్తారేమో అన్పించింది రమేష్‌కు.

వాడు ఎడ్లను అదిలించడం, ఒక పద్ధతి ప్రకారం 'సాలు' పెట్టడం రమేష్‌కు అపూర్వ దృశ్యంలా తోచింది. రమేష్ ఆతురతను నిలుపుకోలేక పోయాడు. మరోసారి అడిగాడు.

''ఇంకాసేపాగు. ఎడ్లు నిమ్మళపడనీ'' చెప్పాడు తమ్ముడు. దాదాపు అరగంట తర్వాత పిల్చాడు.

నాగలి నిలబెట్టి ఎలా పట్టుకోవాలో చూపించాడు రాంరెడ్డి. నాగలి పట్టుకొని అదిలించాడు. తమ్ముడు పక్కనే నడవడం ప్రారంభించాడు. సాలు వంకర టింకర పడడం ప్రారంభించింది. రెండుసార్లు ఎద్దుకాలుకు కర్రుతట్టుకున్నప్పుడు 'కాలుగర్ర పటేల్?' అని హెచ్చరించాడు తమ్ముడు. ఒకసారి ఎడ్లు కుడి వైపునకు తిరిగాయి— ''దాపటెద్దు పగ్గం ..ంజి ఒలపటెద్దును పొడు'' అని చెప్పాడు ..మ్ముడు. అర్థం కాలేదు రమేష్‌కు. పగ్గం ..క్కాని ఎలా సరిదిద్దాలో చూపించాడు. ..రోసారి ఎడమవైపు మళ్ళాయి. అర్థం కాలే..ు. అప్పుడు రమేష్ నుంచి ముల్లుగర్ర ..ాక్కొని దాపటెద్దు మీద గట్టిగా పొడ్చాడు రాంరెడ్డి. సరిగా నడవడం ప్రారంభించాయి. ఐదు నిమిషాలకే ఒళ్ళంతా చెమట పట్టేసింది. అది గమనించి తమ్ముడు నాగలి తీసుకున్నాడు. నాగలి ఇచ్చేసి గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు. ఈ మాత్రం దానికే తాను ఎంతగానో అలసిపోయాడు. రోజంతా ఎలా నాగలి దున్నుతారో అనుకున్నాడు. ఎవరిపని వారికి సులభంగా వుంటుందేమో! తన తమ్ముడు డిటెక్టివ్ నవలలు బహిరంగంగా, సెక్స్ నవలలు చాటుగా చదువుకోవడం తను గమనించాడు. కాని అల్లసాని పెద్దన మను చరిత్రనో, చిన్నయసూరి బాల వ్యాకరణాన్నో చదవమంటే వాడు చదువగలడా? అన్పించేది. తమ్ముడు కూడా అదే అంటాడు. కాని తన చదువుకన్నా నాగలిదున్నడం కష్టమని అర్థ

మైంది రమేష్‌కు. తన చదువు కన్నా వ్యవసాయం పనులు నేర్చుకోవడమే పెద్ద విద్యలా అన్పించింది.

చెట్టునీడన కూర్చొని నాగలి లాగే ఎడ్లనూ, నాగలి వెంట నడిచే తమ్ముణ్ణి చూస్తుండి పోయాడు.

రమేష్‌ను చూశాడు రాంరెడ్డి

''పొద్దు బోతలేదా?'' అడిగాడు

''దాహమేస్తోంది'' చెప్పాడు రమేష్.


నాగలిని నిలబెట్టి 'తాగొద్దాం పద! అన్నాడు రాంరెడ్డి.

ఇద్దరూ బావివైపు బయలుదేరారు. వాడి పక్కన నడుస్తుంటే వాడికన్నా తనెంతో చిన్నవాడినని అన్పించింది.

సర్వీస్ వచ్చి ఆగడంతో ఆలోచనలు ఆగిపోయాయి. జనం తోసుకుంటూ బస్సు ఎక్కడం ప్రారంభించారు. కొందరు తువాళ్ళను,రుమాళ్ళను, చేతి సంచులను బస్సు కిటికీల్లోంచి సీట్ల మీదికి విసిరేస్తున్నారు. తనకు సీటు దొరికేట్లు లేదు. చిరాకేసింది. అందరూ ఎక్కాక తను ఎక్కాడు. లోపలికెళ్ళడానికి చోటు లేదు. లోనికి అతికష్టం మీద జొరబడ్డాడు. చిరాకేసింది. నిరాశా నిస్పృత్తువా ఆవరించాయి. బస్సు ముందు సీట్లనుంచి గట్టిగా తననెవరో కేక వేయడంతో అటువైపు చూశాడు. రమేష్ అటు చూడగానే బాలయ్య ఇటు రమ్మంటూ సైగ చేశాడు. తోసుకుంటూ వెళ్ళి బాలయ్య పక్కన కూర్చున్నాడు. హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు. బాలయ్య పదో తరగతి వరకు తన క్లాస్‌మేట్. పదోతరగతి పాసై కులవృత్తి తాటిచెట్లు గీయడం నేర్చుకొని ఇప్పుడు స్వంతంగా నిర్వహించుకుంటున్నాడు.

** ** ** **

రమేష్ ఊరికొచ్చి వారంరోజులైంది. వారం రోజుల్లో ఊరి మట్టివాసనకూ, తన ఊరివారికీ తానెంత దూరమయ్యాడో అర్థమైంది. తను ఊళ్ళోకెళ్ళినపుడు ఎప్పుడొచ్చారు, బాగున్నారా? వంటి ముక్తసరి ప్రశ్నలేసి వెళ్ళిపోతున్నారు. మరి కొందరు తన ఉనికిని కూడా పట్టించుకోవడంలేదు. అమ్మమాత్రం చిన్నప్పటిలాగానే కొసరి కొసరి వడ్డిస్తున్నది. కాని ఒంటరితనం సైతాన్‌లా పీడించసాగింది. మరిన్ని రోజులు ఊళ్ళో ఉండడం సాధ్యం కాదని అర్థమైంది. మరో సంఘటన కూడా అతన్ని అక్కడ నిలువనీయడం లేదు.




ముగ్గురు తను, తండ్రి, తమ్ముడు రాత్రి పూట కలిసి భోంచేసే సమయంలో తండ్రి పెళ్ళి ప్రస్తావన తెచ్చాడు.

'చాలా మంది తిరిగిపోతున్నారు. రెండు లక్షలైనా ఇస్తామంటున్నారు. ఏమంటావురా రమేష్?'' ప్రశ్నించాడు తండ్రి.

';ఇప్పుడే వద్దు, నాన్నా!' అభ్యంతర పెట్టాడు.

'ఏ వయస్సులో అది జరిగితే బాగుంటుందిరా' అమ్మ కలుగజేసుకుంది.

''జాబ్ దొరికాక చేసుకుంటాను''

ఇప్పుడల్లా దొరుకుతుందా, ఏమన్నానా? వచ్చే కట్నంతో ఉద్యోగమైనా సంపాయించుకోవచ్చు. లేదంటే ఏదన్నా వ్యాపారమైనా పెట్టుకోవచ్చు. ఆలోచించి చెప్పు అన్నాడు తండ్రి.

దానితో నిశబ్దం ఆవరించింది. రమేష్ మదిలో వీణ మెరిగింది. వీణ తన క్లాస్‌మేట్. ఇద్దరూ పెళ్ళి చేసుకుందామనుకున్నారు. అదీ ఇద్దరిలో ఏ ఒక్కరికైనా ఉద్యోగం దొరికితేనే సాధ్యమవుతుంది. దీనికి తోడు తండ్రి పెళ్ళి ప్రస్తావన తేవడంతో మనస్సు మరింత వికలమైంది. భోజనం సయించలేదు.

** ** **

ఉదయంపూట టీ తాగుతున్నప్పుడు 'నేను వెళ్తా, నాన్నా!'' అని తండ్రికి చెప్పాడు రమేష్.

'ఇంకా సెలవులున్నాయి కదరా, ఇప్పుడే వెళ్ళి ఏం చేస్తావ్?'' ప్రశ్నించాడు తండ్రి.

'చదువుకోవాలి''

'ఇక్కడచదువుకో!అక్కడ హాస్టల్‌లో అడ్డమైన గడ్డీ తినే కన్నా ఇక్కడే ఉండు''

'పుస్తకాలు లేవు'

''వచ్చేప్పుడు తెచ్చుకోవద్దా?''

లైబ్రరీ పుస్తకాలు కొన్ని బయటికివ్వరు''

'ఎప్పుడు వెడతావు?'

'రేపు'

'సరే'

'డబ్బులు కావాలి'

'ఎంత?'

'ఓ ఐదువందలు'

'రాముడూ!' కేకేశాడు తండ్రి. రామిరెడ్డి లోపలి నుంచి ఏమిటన్నట్లు వచ్చాడు.

'వాడికో ఆరువందల రూపాయలివ్వు'

'సరే నాన్నా!' అంటూ రామిరెడ్డి లోపలికెళ్ళిపోయాడు. దానితో రమేష్‌ను దిగులు ఆవరించింది. తనకన్నా చిన్నవాడు అప్పుడే వ్యవహారం నడుపుతున్నాడు. అంతే అయితే ఫరవాలేదు. తను వాడిమీద ఆధారపడాల్సి రావడమే అతన్ని మరింత కలవరపర్చింది. తన మీద తనకే కోపం వచ్చింది. చదువుకోకుంటేనే బాగుండేదేమో అన్పించి బాధేసింది.

రామిరెడ్డి డబ్బులు తెచ్చి అన్నకిచ్చాడు. రమేష్ వాలకం కనిపెట్టి 'దిగులుగా వున్నావేమిట్రా?' ప్రశ్నించాడు. తండ్రి.

'ఏం లేదు' పొడిగా సమాధానమిచ్చాడు.

'పెళ్ళయితే అవన్నీ పోతాయి. ఏ వయస్సులో జరగాల్సింది ఆ వయస్సులో జరగాలి. లేకుంటే అట్లాగే వుంటుంది' ఉపన్యాసం ఇచ్చాడు తండ్రి.

మాట్లాడలేదు రమేష్

'మాట్లాడవేరా! చిన్నోడేమో పెళ్ళికి తొందరపడుతున్నాడు. వాడి పెళ్ళి కావడానికైనా నీకు పెళ్ళి జరగాలి కదా!' అన్నాడు.

'వాడ్ని చేసుకోమనండి'

'నీ కేమైనా మతిపోయిందా? కాలొంకరా, కన్నొంకరా నీకేమైందని నీకు కాకుండా వాడికి పెళ్ళి చేయాల్సిన ఖర్మ పట్టింది' కొంచెం కోపంగానే అన్నాడు తండ్రి.

ముభావంగా అక్కణ్ణుంచి తప్పుకున్నాడు రమేష్.